సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం । 20 । మే । 2023



చిలకలగుట్టకు రక్షణ వలయం

ములుగు జిల్లాలోని సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.60లక్షల నిధులు కేటాయించారు.

- 8లో▸



21 నుంచి పలు రైళ్ల రద్దు

కాజీపేట–కొండపల్లి రైలు మార్గంలో ఈనెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు పలు రైళ్లు రద్దు కానున్నాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
42.5^0 / 24.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కాళేశ్వరాలయానికి కేంద్రమంత్రి రాక

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామిని దర్శించుకోవడానికి నేడు (శనివారం) కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల రానున్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకోనున్నారు. ఆయన వెంట పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకట్‌స్వామి, మంథని బీజేపీ ఇన్‌చార్జ్ చందుపట్ల సునీల్‌రెడ్డితో పాటు బీజేపీ నాయకులు రానున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.50 కోట్ల నిధులు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కేటీఆర్‌ను కోరగా, శుక్రవారం రూ. 30 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు గండ్ర వెంకటరమణా రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టీబీ పరీక్షలు విస్తృతంగా చేయాలి


భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని పీహెచ్‌సీల వారీగా టీబీ పరీక్షలను విస్తృతంగా నిర్వహించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ టీబీ నియంత్రణపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రామాల వారీగా టీబీ బారిన పడిన వారిని గుర్తించి వారికి తగిన పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని మహాముత్తారం, పలిమెల, మల్హర్ మండలాల్లో హెల్త్ సబ్‌సెంటర్‌లకు దూరంగా ఉండే ఆదివాసీ గ్రామాలను గుర్తించి నిరంతరం వైద్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ అన్వేషిని, డాక్టర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



గణపురం: కేటీకే ఓసీ త్రీలో లైట్ వెహికిల్ వాహనాలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలు నడిపి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ సాంబయ్య అన్నారు. ఈ నెల 17 నుంచి 31 వరకు జరిగే భద్రత వారోత్సవాల్లో భాగంగా ఓసీ త్రీ ప్రాజెక్టుకు ముఖ్యఅతిథిగా హాజరై రక్షణపై పలు సూచనలు చేశారు. వాహనాలను ఎల్లప్పుడు కండిషన్‌లో ఉంచుకోవాలని, డ్రైవర్లు తప్పకుండా యూనిఫామ్, క్యాప్, షూ, రేడియం జాకెట్లను ధరించి వాహనాలు నడుపాలన్నారు. ఓపెన్‌కాస్టులో నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ప్రసాద్, ప్రాజెక్టు ఆఫీసర్ రాజశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ విశ్వనాథ్, మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ కుమారస్వామి, సిద్ధిరాములు, సుదర్శన్ పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీ వీసీ పూజలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వర స్వామిని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ మల్లేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శుక్రవారం ఆయన ఆలయ రాజగోపురం వద్దకు రాగా అర్చకులు ఆలయ మర్యాదలతో వేద మంత్రోచ్చారణల మధ్య స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ శుభానందదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. కల్యాణ మండపం వద్ద ఆయనను అర్చకులు బైకుంతపాండా స్వామివారి కండువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డిలు ఉన్నారు.

జిల్లా స్థాయి పోటీలను విజయవంతం చేయాలి

ములుగు: ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఏటూరునాగారంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ కృష్ణా ఆదిత్య సూచించారు. పోటీల్లో పాల్గొనే వారికి సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. క్రీడలను అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆగుతూ..సాగుతూ..

నత్తనడకన కాళేశ్వరం దేవస్థానం అభివృద్ధి పనులు
- రూ.25కోట్ల పనులు ఏళ్లుగా సాగుతున్న వైనం
- పట్టించుకోని దేవాదాయశాఖ

కాళేశ్వరం: దేవుడు వరం ఇచ్చిన పూజారి కనికరించని చందంగా మారింది కాళేశ్వరం దేవస్థానం అభివృద్ధి పనులు. స్వయాన సీఎం కేసీఆర్ కాళేశ్వరం ఆలయానికి 2016 మే 2న కాళేశ్వరం ప్రాజెక్టుకు భూమి పూజ చేయడానికి వచ్చి ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆ సమయంలో కాళేశ్వరం ఆలయ అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో 2017లో నిధులకు పరిపాలన అనుమతులతో పనులు ప్రారంభించారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేసి రాష్ట్ర మంతటికి నీటిని అందిస్తున్నప్పటికి కాళేశ్వరం ఆలయ పనులు మాత్రం పూర్తి కాలేదు. పంచాయతీరాజ్, ఎండోమెంట్, ఫారెస్ట్, ఉద్యానవశాఖలకు పనులు అప్పగించారు. దీంతో దేవాదాయశాఖ, ఇతర ఇంజనీరింగ్ అధికారులు మొద్దు నిద్రను వీడడం లేదు.

ప్రారంభం కానివి..

క్యూ కాంప్లెక్స్ భవనం, ప్రసాదశాల, ప్రసాదం తయారీ పాత్రలు, ఆలయం చుట్టూర సాలహారం, అనివెట్టి మండపం, కల్యాణ మండపం, పార్వతీ ఆలయం, ఆర్చీ గేటు నిర్మాణాలు చేపట్టారు. పూర్తయిన వీటికి మాత్రం ప్రారంభోత్సవాలు జరుగలేదు. 100 గదుల నిర్మాణం పూర్తయినా సెప్టిక్ ట్యాంక్, ఎలక్ట్రిసిటీ లేదు.



కాళేశ్వరాలయం రాజగోపురం

స్థలాలు లేక..

అపరకర్మ మండపం, డార్మెటరీ హాల్ నిర్మాణాలు ఇంకా మొదలు కాలేదు. డార్మెటరీ హాల్ నిర్మాణానికి హనుమాన్ దేవాలయం వద్ద స్థలం కేటాయించిన పనులు మొదలు కాలేదు. అపరకర్మ మండపానికి స్థలం ఎంపిక పరిశీలనలో ఉంది. వీటి చుట్టూర కాంపౌండ్ నిర్మాణం చేపట్టాలి. ఉద్యానవన శాఖ ద్వారా పార్కులు పనులు చేపట్టాల్సి ఉన్న మరిచిపోయారు. దీంతో కొన్ని నిర్మాణాలు ఆగుతూ...సాగుతూ ఏడు సంవత్సరాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మూడేళ్లలో కాళేశ్వరం పూర్తి..

2016 మే 2న భూమి పూజ చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చకాచకా జరిగాయి. 2019 జూన్ 21న ప్రారంభోత్సవం కూడా జరిగింది. నీటి ఎత్తిపోతలు ప్రారంభించి రాష్ట్ర నలుమూలలకు సరఫరా చేస్తున్నారు. కానీ ఇక్కడ నిర్మాణాలు మాత్రం



కొత్తగా నిర్మించిన గోపురం స్లాబు

ఇప్పటికీ నిర్మాణ దశలో కొన్ని.. నిర్మాణాలు పూర్తయి ప్రారంభం కాక మరి కొన్ని.. స్థలాల ఎంపిక లేక మరికొన్ని భక్తులను వెక్కిరిస్తున్నాయి.

శిథిలావస్థలో భవనాలు

కాళేశ్వరాలయానికి గతంలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వినియోగంలో లేవు. వాటిని తొలగించి కొత్త నిర్మాణాలకు ఉపయోగించవచ్చు కానీ దేవాదాయశాఖ మాత్రం అటువైపు ఆలోచనలు చేయడం లేదని తెలిసింది. గుప్తకాటేజీ పోలీస్‌స్టేషన్‌కు ఉత్సవాల సమయంలో అప్పుడప్పుడు వాడుతున్నారు. హనుమంతరావు గెస్ట్‌హౌస్, తితిదే దేవస్థానం వసతి గృహాలు కూలిపోయే దశకు చేరాయి.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే..



ఏడు సంవత్సరాలుగా కాళేశ్వరం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నాణ్యత పాటించకుండా పనులు చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షలు జరిపాలి. నిర్మాణాలు పూర్తయిన అన్ని అసంపూర్తిగానే ఉన్నాయి. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవాలి.

- ఎల్.రాజబాపు, కాళేశ్వరం

బిల్లులు సకాలంలో రాక..



కాళేశ్వరాలయంలో చేపట్టిన పనులు అన్ని అసంపూర్తిగానే ఉన్నాయి. పూర్తయిన వాటికి లోపల కొన్ని పనులు బ్యాలెన్స్ ఉన్నాయి. బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు నత్తనడక చేస్తున్నారు. డార్మెటరీ హాల్ నిర్మాణానికి భూమి విషయంలో ఫారెస్టు–రెవెన్యూ మధ్య వివాదం ఉంది. రెండు నెలల్లో పనులు పూర్తి చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

- ఎస్.మహేష్, ఈఓ, కాళేశ్వరం దేవస్థానం

అక్రమ వెంచర్లపై కఠిన చర్యలు

కలెక్టర్ భవేష్ మిశ్రా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి: జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. భూపాలపల్లి తహసీల్దార్ ఎండీ ఇక్బాల్, మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ అనిల్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ శుక్రవారం అనుమతులు లేని వెంచర్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో మొత్తం 15 అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఆయా వెంచర్ల నిర్వాహకులు సంబంధిత అనుమతి పత్రాలు, పూర్తి వివరాలను వారం రోజుల్లో చూపించాలని ఆదేశించారు. లేనిపక్షంలో సదరు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఉత్తమ గ్రామాలను ఎంపిక చేయాలి

భూపాలపల్లి రూరల్: స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో అభివృద్ధిలో పురోగతి సాధించిన రెండు వేల నుంచి ఐదువేలలోపు జనాభా కలిగిన గ్రామాలను ఉత్తమ అవార్డులకు ఎంపిక చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రగతి భవన్ ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మండలంలోని మూడు గ్రామాలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, జెడ్పీసీఈఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ పురుషోత్తం, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఈనెల 21న గోదావరిఖనిలో జరిగే సింగరేణి కాలనీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) మహాసభల వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఏరియాలోని కేటీకే ఐదో గని ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి రాజయ్య మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులు ఎదుర్కొన్న సమస్యలు, కార్మికుల మారు పేర్లు సరి చేయాలని, అండర్ గ్రౌండ్ విధులు నిర్వహిస్తున్న మైనింగ్ స్టాఫ్ టెక్నీషియన్లు, ఎస్డీఎల్ ఆపరేటర్లకు సర్ఫేస్లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని, కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని మహాసభను నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాసభకు సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రాములు, వెంకయ్య, భద్రయ్యలు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగించాలి




నివాళులర్పిస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు కోరారు. ఈ మేరకు సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ సుందరయ్య ఆశయ స్ఫూర్తితో పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలకు పట్టాలు, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన పది లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఐదు లక్షల రూపాయలు ఇచ్చేంతవరకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వెలిశెట్టి రాజయ్య, శ్రీకాంత్, రమేష్, కోమల, నరేష్, వెంకటేష్, సుశీల, శేఖర్, అఖిల్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఎస్పీ సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ సురేందర్‌రెడ్డి

భూపాలపల్లి: జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వానాకాలం సాగు ప్రారంభం అవుతున్న దృష్ట్యా కొందరు వ్యాపారులు, మధ్య దళారులు నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేసే అవకాశం ఉందన్నారు. నకిలీ విత్తనాల సరఫరా, నాసిరకం ఎరువులను అరికట్టేందుకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో నేరాల నియంత్రణపై చేపట్టిన చర్యలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలన్నారు. ముఖ్యంగా నిఘా వ్యవస్థకు ప్రధాన సంపత్తిగా మారిన సీసీ టీవీల వలన భద్రతా ప్రమాణాలు పెరుగుతున్న క్రమంలో ×నేను సైతం॥ కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటును మరింత ప్రోత్సహించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అలాగే మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ, వారి రక్షణే ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన సత్వర సేవలు అందించాలన్నారు. అలాగే పోలీసుశాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫంక్షనల్ వర్టికల్ అమలుపై క్షేత్రస్థాయిలో దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు రాబట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.శ్రీనివాసులు, అదనపు ఎస్పీ (ఏఆర్) వి శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ రాములు, వర్టికల్ డీఎస్పీ కిషోర్‌కుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దాలి



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

భూపాలపల్లి: భూపాలపల్లిని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు సూచించారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 8వ వార్డు జవహర్‌నగర్ కాలనీలో చేపడుతున్న పనులను వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు, కౌన్సిలర్ నూనె రాజుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మురుగు కాల్వల్లో చెత్తను తొలగించడం, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ అనిల్‌కుమార్, కౌన్సిలర్లు జక్కం రవికుమార్, మేకల రజిత, బీఆర్ఎస్ నాయకులు పైడిపెల్లి రమేష్, లక్కం దేవేందర్ పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



నైపుణ్య పరీక్షను పరిశీలిస్తున్న అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఐటీడీఏ పెసా జిల్లా సమన్వయ కర్త ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నార్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తక్కలపాడు చెరువులో నార్లాపూర్, తాడ్వాయి, బయ్యక్కపేట, గ్రామాల్లోని 79 మంది మత్స్యశాఖ ఆధ్వర్యంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సంఘాలకు నైపుణ్యత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ వలలు విసరడం, ఈత కొట్టడం, వల లాగడం లాంటి పరీక్షలు నిర్వహించామన్నారు. సొసైటీల ఏర్పాటు ద్వారా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయుచున్న మత్స్య సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ,ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం పెసా జిల్లా సమన్వయ కర్త కొమురం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల్లో నీలి విప్లవాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సిద్దబోయిన చిన్నక్క, గుర్రం సమ్మిరెడ్డి, మత్స్య సొసైటీ అధ్యక్షులు మనోహర్, బంగారి సాంబయ్య, శ్రీకాంత్, సిబ్బంది కృష్ణ, పెసా మొబిలైజర్లు రాజేష్, నవీన్ పాల్గొన్నారు.

రూ.2వేల నోటు రద్దుపై భిన్నాభిప్రాయాలు

- రాజకీయ నాయకుల లాభం కోసమే..
- కొత్తగా ముద్రించిన సమయంలో చూశాం..



భూపాలపల్లి: రూ.2వేల నోటు రద్దుపై వివిధ వర్గాలనుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నోటు రద్దు విషయంలో ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని మొదటినుంచి జనంలో కొంత సందేహం ఉందని కొందరు అంటుండగా అప్పుడు పాత నోట్ల రద్దు నిర్ణయం ప్రభుత్వం చేసిన తప్పిదమా అని మరికొందరు అంటున్నారు. దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకున్న సంచలన నిర్ణయాల్లో నోట్ల రద్దు ఒకటి. 2016 నవంబర్ 8 అర్ధరాత్రి నుంచి అప్పటి వరకు దేశంలో చలామణిలో ఉన్న రూ.1000, 500 నోట్లు చెల్లుబాటు కావని, వాటిని బ్యాంకుల్లో జమచేసి మార్చుకోవాలని స్వయంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. దీని వెనుక ప్రభుత్వం ఉద్దేశం, సాధించిన లక్ష్యం ఏమైనప్పటికీ సామాన్యులను మాత్రం కుదేలు చేసింది. అదే సమయంలో ప్రభుత్వం కొత్తగా రూ. 2వేలు, 500 నోట్లను తీసుకువచ్చింది. ఈ నోట్లు పేదవాడి చేతికి చేరడానికి చాలా సమయం పట్టింది. ఈ క్రమంలో ఏటీఎంలు, బ్యాంకుల వద్ద బారులు తీరిన దృశ్యాలు మనం చూశాం. అంతా సర్దుకుంటున్న సమయంలో ఆర్‌బీఐ పిడుగులాంటి వార్త చెప్పింది. దేశవ్యాప్తంగా రూ.2వేల నోట్లు వెనక్కి తీసుకుంటున్నామని, వాటిని ఒక్కొక్కరు 10 నోట్లు అంటే రూ.20 వేలకు మించకుండా మార్చుకోవచ్చని తెలిపింది. నోట్ల రద్దుపై వివిధ వర్గాలు ఏమనుకుంటున్నాయో చూద్దాం.

రాజకీయ నాయకుల లాభాల కోసమే..



రాజకీయ నాయకుల లాభాల కోసం, వారు దాచుకున్న డబ్బును మార్చుకునేందుకే రూ.2 వేల నోట్ల రద్దు ప్రక్రియను తెర మీదకు తీసుకొచ్చారు. నిరుపేదల దగ్గర పెద్దనోట్లు దాచుకునే పరిస్థితి లేదు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ నాయకులకు ఆర్బీఐ సహకరిస్తుంది.

- సంగెం రవీందర్, న్యాయవాది, భూపాలపల్లి

ఆర్బీఐ మంచి పని చేసింది..



రూ. 2 వేల నోట్లు కొత్తగా ముద్రించిన సమయంలో చూసాం. ఆ తర్వాత చూడ లేదు. పెద్ద నోట్లన్ని పెద్దోళ్ల దగ్గరే మూలుగుతున్నాయి. రూ.2 వేల నోట్లను రద్దు చేయడం మంచిదే. ఈ నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రజలకు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు.

- నూతలపాటి వెంకటేశ్వర్లు, హోటల్ యజమాని

ఇది సంచలన నిర్ణయం..



ఆర్బీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు, నేతలు బ్లాక్ మనీతో ఓట్లను కొనుగోలు చేయకుండా పెద్ద నోట్లను రద్దు చేయడం హర్షనీయం. ఓట్లను కొనే నేతలకు ఈ చర్య చెంపపెట్టు లాంటింది. పెద్ద నోట్ల మార్పిడితో డబ్బంతా మళ్లీ మార్కెట్‌లో చలామణి అవుతుంది.

- అజ్మీరా రవీందర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

హేమాచలుడి హుండీ ఆదాయం రూ.11.04లక్షలు

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరకాల డివిజన్ పరిశీలకులు అనికుమార్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రావణం సత్యనారాయణ పర్యవేక్షణలో శుక్రవారం జరిగింది. ఆలయంలో జనవరి 10న ఏర్పాటు చేసిన 8 హుండీలతో పాటు ఈనెల 1 నుంచి 10 వరకు జరిగిన స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మే 4న ఏర్పాటు చేసిన మరో 8 మొత్తం 13 హుండీలను స్వామివారి కల్యాణ మండపంలో భక్తుల సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకల ద్వారా రూ 11,04,360 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ వెల్లడించారు. గత ఏడాది బ్రహ్మోత్సవాలు(జాతర) సందర్భంగా రూ 9,57,800 హుండీ ఆదాయం కంటే ఈ ఏడాది రూ 1,45,56 అదనపు ఆదాయం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు కైంకర్యం రాఘవాచార్యులు, ముక్కామల శేఖర్ శర్మ, కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు, ఏడునూతుల ఈశ్వర్‌చంద్ రామానుజం, సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, ముకుందం, శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ మహిళా ప్రధానకార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా ప్రియాంకగాంధీ చేసిన యూత్ డిక్లరేషన్‌ను స్ఫూర్తిగా తీసుకొని నిరుద్యోగ యువకులు నడుంబిగించాలన్నారు. రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొనే యువతీయువకులు 7661899899కు మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. జూన్ 1వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని, నియోజకవర్గ కోడ్ 1129 మీదుగా జూన్ 2వ తేదీన 40 మందిని విజేతలుగా ప్రకటిస్తారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల కుమారస్వామి, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి నూనేటి శ్యాం, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్‌యాదవ్, ఎస్సీ సెల్ మండల పార్టీ అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి, ఆలోత్ దేవ్ సింగ్, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏటూరునాగారం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ మారథాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బి/39 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో పర్యావరణ మారథాన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ మొక్కలను ప్రతి ఒక్కరు నాటాలన్నారు. ప్రతి వ్యక్తి వారి పుట్టిన రోజు సందర్భంగా మొక్కను నా టితే ఎంతో మేలు జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

21 నుంచి పలు రైళ్ల రద్దు



దోర్నకల్: కాజీపేట– కొండపల్లి రైలు మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులతోపాటు, చింతపల్లి, నెక్కొండ స్టేషన్ల మధ్య పనులు జరగనుండటంతో ఈ నెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు కాజీపేట –విజయవాడ మార్గంలో పలు రైళ్లు రద్దు కానున్నాయి.

రద్దు కానున్న రైళ్ల వివరాలు:

07753 కాజీపేట– డోర్నకల్
07754 డోర్నకల్– కాజీపేట
07755 విజయవాడ– డోర్నకల్
07756 డోర్నకల్– విజయవాడ
07464 విజావాడ– గుంటూరు
07465 గుంటూరు– విజయవాడ
17660 భద్రాచలంరోడ్– సికింద్రాబాద్
17659 సికింద్రాబాద్– భద్రాచలంరోడ్
12713 విజయవాడ– సికింద్రాబాద్
12714 సికింద్రాబాద్– విజయవాడ
07091 కాజీపేట–తిరుపతి
(మే 23, 30, జూన్ 6న రద్దు)
07092 తిరుపతి– కాజీపేట
(మే 23,30, జూన్6న రద్దు)
07185 మచిలీపట్నం– సికింద్రాబాద్
(మే21, 28, జూన్ 4న రద్దు)
07186 సికింద్రాబాద్– మచిలీపట్నం
(మే21, 28, జూన్ 4న రద్దు)

తాత్కాలికంగా రద్దయ్యే రైళ్లు..

- సిర్పూర్ టౌన్– భద్రాచలం(17034) 20వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వరంగల్, భద్రాచలం మధ్య రద్దు
- భద్రాచలం–సిర్పూర్ టౌన్(17033) 21వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు భద్రాచలం, వరంగల్ మధ్య రద్దు
- బెలగావి– మణుగూరు(07335) 20వ తేదీ నుంచి జూన్ 6 వరకు కాజీపేట, మణుగూరు మధ్య రద్దు
- మణుగూడు– బెలగావి(07336) 21వ తేదీ నుంచి జూన్ 7 వరకు మణుగూరు, కాజీపేట మధ్య రద్దు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఎండదెబ్బకు ఆగిన గుండె



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గుండమల్ల వెంకటయ్య (67) శుక్రవారం వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఆయన తన వరిచేను వద్దకు వెళ్లి పొలం కోయించి ఇంటికి తిరిగి వచ్చి ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురయ్యారు. ఆ వెంటనే కొంత సమయానికి ఇంటి వద్దే మృతిచెందారు. వెంకటయ్యకు భార్య ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కడిపికొండ భూమి టీఎన్జీవోస్‌దే..!

- ఉద్యోగుల సొసైటీ భూమి వదిలే ప్రసక్తేలేదు
- రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధం
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల నివాస స్థలాల కోసం సీఎం కేసీఆర్ కడిపికొండలో కేటాయించిన భూమిలోకి వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగుల పై దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడిన అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగులు విరామ సమయంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. నిరసనలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం కడిపికొండలో కేటాయించిన 32 ఎకరాల స్థలంలో కబ్జాల విషయం గతంలోనే కలెక్టర్, పోలీస్ కమిషనర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉద్యోగులకు కేటాయించిన భూమిని పరిశీలించేందుకు వెళ్లిన ఉద్యోగులపై కొంత మంది దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారని, ఈవిషయాన్ని ఉద్యోగ సంఘాల ఏజేసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉద్యోగుల భుమి ఆక్రమణకు పోత్సహిస్తున్న వారు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈవిషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. దోషులను శిక్షించే వరకు ఉద్యమిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రేక్షక పాత్ర వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేసేందుకు సిద్ధమని తెలిపారు. గెజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అన్నమనేని జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదన్నారు. సీఎం స్వయంగా ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న కొంతమంది అధికారుల వైఖరి వల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. వెంటనే కలెక్టర్, సీపీ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి ఉద్యోగుల భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, వేణుగోపాల్, బూరుగు రవి, ములుగు జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, నాగరాజు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, సభ్యులు వేణుగోపాల్, రమేష్, అశోక్, శ్యాంసుందర్, వెంకట్రామ్‌రెడ్డి, సారంగపాణి, భూక్య రాము, డాక్టర్ ప్రవీణ్, సురేష్, బింగి సురేష్, రాజేష్‌ఖన్నా, రాజీవ్, అనుప్, భరత్, ప్రణయ్, రాజ్యలక్ష్మి, పావని, శ్రీలత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- లైసెన్స్ షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- వ్యవసాయధికారి విజ్ఞాన్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



ఎరువులు, విత్తన షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయధికారి జి. విజ్ఞాన్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ హెచ్చరించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు లైసెన్స్ ఉన్న షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. శుక్రవారం వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్తంగా వరంగల్ ఫోర్ట్ రోడ్డులో ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో అందుబాటులో ఉన్న పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఇతర పంటల విత్తనాల ప్యాకెట్లు, పురుగు మందులను పరిశీలించారు. సుమారు 25 విత్తనాల షాపులను తనిఖీ చేసి రికార్డులు, విత్తనాల విక్రయాల అనుమతులు, కంపెనీ గుర్తింపును అడిగి తెలుసుకున్నారు. పలు షాపుల్లో విత్తన నమూనాలను పరిశీలించారు. నిషేధిత విత్తనాల విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, ఏఓ విజ్ఞాన్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లైసెన్స్ గల షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బ్రోకర్ల మాయమాటలు నమ్మొద్దని, లూజు పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వారివద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మేలైన విత్తనాలు కొనుగోలు చేసి బిల్లు తీసుకోవాలని, పంట ముగిసే వరకూ భద్రపర్చుకోవాలని చెప్పారు. పంట దిగుబడులు రానియెడల అధికారులకు తెలిపి పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. విత్తన బ్రోకర్ల మాటలు నమ్మొద్దని వ్యవసాయాధికారులు సూచించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి మంచి దిగుబడులు సాధించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుమన్, సాంబయ్య, కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

'నిట్'ల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్: దేశ వ్యాప్తంగా 31 నిట్‌ల బలోపేతానికి కృషి చేసేందుకు నిట్ వరంగల్‌లోని బోస్ సెమినార్ హాల్‌లో శుక్రవారం టు వర్డ్స్ ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ నిట్స్ అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, మాట్లాడారు. దేశవ్యాప్త నిట్‌లను ప్రపంచ స్థాయికి తీర్చిదిద్దేందుకు పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని అన్నారు. నిట్‌ల బలోపేతానికి దేశవ్యాప్త నిట్‌లను ఏకం చేసేందుకు నిట్ వరంగల్ ముందడుగు వేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో 1959లో తొలి ఇంజనీరింగ్ కళాశాలగా నాడు ఆర్‌ఈసీ నేటి నిట్ దేశ వ్యాప్త 31 నిట్‌లకు పెద్దన్నగా నిలుస్తుందని నిట్ రూర్కేలా రిటైర్డ్ డైరెక్టర్, ప్రొఫెసర్ సునీల్‌కుమార్ సారంగి తెలిపారు. న్యూ ఎడ్యుకేషనల్ పాలసీ–2020 అనుగుణంగా విద్యాబోధనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నిట్ రూర్కేలా డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రావు, నిట్ వరంగల్ రిజిస్ట్రార్ గోవర్దన్‌రావు, ప్రొఫెసర్లు వీరాంజనేయులు, దేశవ్యాప్త నిట్‌ల డైరెక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో బదిలీలు..?

- సోమవారం ఉత్తర్వులు వెలువడే అవకాశం

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లతో పాటు జిల్లా రిజిస్ట్రార్ల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ , రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్లతో కూడిన ఓ కమిటీ బదిలీల ప్రక్రియపై కసరత్తు ప్రారంభించనట్లు తెలిసింది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన గ్రేడ్–1, గ్రేడ్–2 మూడేండ్లు నిండిన సబ్ రిజిస్ట్రార్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శుక్రవారం బదిలీల సమాచారం చర్చనీయాంశంగా మారింది. దీంతో కొందరు బదిలీలకు బ్రేక్ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నట్లు వినికిడి.

గంజాయి విక్రయదారు అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్: ఎల్‌బీ నగర్‌లోని జియా మసీదులో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ.. వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న అమన్ హాజీజ్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి అమ్మకాలు, వినియోగం గురించి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులతో కలిసి కమిషనర్ టాస్క్ ఫోర్స్ వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయాలు, వినియోగంలో పాల్గొంటుండగా హజీజ్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి కిలో 200గ్రాముల ఎండు గంజాయి, మొబైల్ ఫోన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. హజీజ్ గత ఏడాది నుంచి గంజాయి విక్రయాలు, సేవించడం అలవాటు చేసుకుని, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు నిందితున్ని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, కె.జనార్దన్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నిస్సార్‌పాషా, బి.శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

బోల్లోనిపల్లిలో కుల బహిష్కరణ

- భూమి రిజిస్ట్రేషన్ చేయడంలేదని కుల పెద్దల నిర్ణయం
- పాలు పోయకూడదని హుకుం జారీ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

నల్లబెల్లి: కుల సంఘానికి రాసిచ్చిన భూమి రిజిస్ట్రేషన్ చేయించడంలేదని ఓ కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బోల్లోనిపల్లికి చెందిన తిప్పని పెద్దసారయ్య గౌడ్ గ్రామానికి చెందిన గీతకార్మిక సంఘంలో చిట్టీ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నాడు. చిట్టీ డబ్బులు తీసుకున్న ఇద్దరు సభ్యులు కొన్నాళ్ల తర్వాత మృతి చెందారు. వీరితోపాటు మరికొందరు సభ్యులు సంఘానికి చెల్లించాల్సిన చిట్టీ డబ్బు ఇవ్వలేదు. దీంతో సంఘం పెద్దలు పెద్ద సారయ్యను బాధ్యుడిగా చేస్తూ నువ్వే చెల్లించాలని 20 ఏళ్ల క్రితం తీర్మానం చేసి ఎకరం భూమిని బలవంతంగా ఆక్రమించుకున్నారు. ఈ భూమిని గౌడ సంఘం పేర రిజిస్ట్రేషన్ చేయాలని కుల పెద్దలు గట్టు సమ్మయ్య, తిప్పని రవీందర్, లింగమూర్తి, మాదాసు ఐలయ్యలతో పాటు పలువురు పెద్ద సారయ్య కుటుంబంపై ఒత్తిడి చేస్తూ మానసికంగా వేధిస్తున్నారు. ఇదిలా ఉండగా పెద్ద సారయ్య కుమారుడు శ్రీనివాస్ తన భూమిని ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా విషయం తెలుసుకున్న కుల పెద్దలు అక్కడికి చేరుకొని అడ్డుకుని.. సంఘానికి రాసిచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేసే వరకు భూమిని దున్నకూడదని బెదిరించారు. అందుకు అంగీకరించకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసే వరకు పెద్ద సారయ్య కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు నిర్ణయించారు. వారితో మాట్లాడితే రూ.5 వేలు జరిమానా చెల్లించాలని, పాలు కూడా పోయకూడదని హుకుం జారీ చేసినట్లు బాధితుడు పెద్ద సారయ్య పేర్కొన్నాడు. ఈ విషయమై ఎస్సై నైనాల నగేష్‌ను సంప్రదించగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు పరికి కోర్నేల్, బట్టు సాంబయ్య, బొట్ల నరేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని వడ్డెపల్లి చెరువు కట్ట రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకా రం .. సుమారు 59 ఏళ్ల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 5.4 ఎత్తు, చామన ఛాయ, తెలుపు రంగు చొక్కాపై ఎరుపు గీతల లైన్లు, బూడిద రంగు ప్యాంట్, ఎడమ చేతిపై డీఏఆర్ అని పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్ స్టేషన్ 9493201968లో సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల పట్టాలు వచ్చేవరకు పోరాడతాం

- సీపీఎం నేత నాగయ్య



నినాదాలు చేస్తున్న నాగయ్య, నాయకులు


కరీమాబాద్: పేదల ఇళ్లకు పట్టాలు వచ్చే వరకు పోరాడతామని సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు జి.నాగయ్య అన్నారు. ప్రతీ పేదవాడికి కూడు, గూడు కోసం పోరాడేది సీపీఎం పార్టీయేనన్నారు. కరీమాబాద్ సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భట్టుపల్లి రోడ్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలోని గుడిసెల ప్రాంతాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు సందర్శించారు. పార్టీ జెండా ఆవిష్కరణ చేసి కాలనీకి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం నగర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. పేదలు వేలాది రూపాయల కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు సంబంధించి ఎన్నికల వాగ్దానం ప్రకారం జీఓ 58 ద్వారా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు హామీలకే పరిమితమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి మరోసారి పేదలను మోసం చేయడానికి కుటిల బుద్ధితో పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. గుడిసెల పోరాటంలో మహిళలదే కీలకపాత్ర ఉంటుందని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా మహిళలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగయ్య, రత్నమాల, ముక్కెర రామస్వామి, సాగర్, యాదగిరి, బషీర్, అరుణ్‌కుమార్, మధుకర్, మల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలతో ముందుకెళ్లాలి

ఖిలా వరంగల్: భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలతో సీపీఎం శ్రేణులు, యువత ముందుకెళ్లాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ శంభునిపేటలో ఓ ఫంక్షన్ హాలులో సీపీఎం రంగశాయిపేట ఏరియా కమిటీ కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన పుచ్చలపెల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. కార్మికుల కూలి రెట్ల పెంపు కోసం ఉద్యమాలు చేసిన ఘన ఆయనకే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ప్రత్యూష, సాంబమూర్తి, గణే పాక ఓదెలు, లక్క రమేష్, రత్నం దాసు ,జ్యోతి, గజ్జ చందు, ఉసిల్ల కుమార్ పాల్గొన్నారు.

చిలకలగుట్టకు రక్షణ వలయం

- ఫెన్సింగ్ ఏర్పాటుకు శ్రీకారం
- పూజలు నిర్వహించిన పూజారులు, అధికారులు



చిలకల గుట్ట (ఫైల్)



పూజలు చేస్తున్న ట్రైబల్ ఈఈ హేమలత

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగుజిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. చిలకల గుట్టపై కొలువుదీరిన సమ్మక్క తల్లిని పూజారులు ప్రతీ రెండేళ్లకు ఒకసారి కుంకుమ భరిణి రూపంలో గద్దె పైకి తీసుకొస్తుంటారు. తల్లి కొలువుదీరిన పవిత్ర గుట్టకు రక్షణగా అధికారులు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు తల్లివారం (ఈనెల 18) గురువారం పూజారులు, అధికారులు కలిసి పూజలు నిర్వహించారు. గతంలో కొంతమేరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వదిలేశారు. గుట్టకు ఫెన్సింగ్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని మంత్రులు, అధికారులను పూజారులు ప్రతి జాతరలో కోరుతున్నారు. ఎట్టకేలకు ఫెన్సింగ్ ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టడంతో పూజారులు, భక్తుల కల నెరవేరనుంది.

రూ.60లక్షల నిధులు..

ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిలకలగుట్ట చుట్టూ 425 మీటర్ల పొడువున ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.60 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో గుట్ట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సమ్మక్క తల్లి కొలువుదీరిన గుట్టపైకి భక్తులు, స్థానిక ప్రజలు ఎక్కడం వల్ల అపవిత్రం అవుతుందని పూజారుల నమ్మకం. గత నాలుగు జాతరల క్రితం గుట్ట చుట్టూ కొంత మేర (600 మీటర్ల) వరకు జాలి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మిగిలిన ఫెన్సింగ్ పనులు ఈ సారి పూర్తి చేయనున్నారు. 2024, ఫిబ్రవరిలో జరిగే మహాజాతరకు ముందుగానే ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిలుకలగుట్టకు రక్షణ కవచం పనులు మొదలయ్యాయి. దీంతో తల్లి గుట్టకు రక్షణ లభించనుంది.

పవిత్రమైన గుట్టను కాపాడేందుకే..

సమ్మక్క తల్లి స్వయాన కొలువు ఉన్న చిలకలగుట్ట పైకి భక్తులు, ప్రజలు ఎక్కేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అంతే కాకుండా గుట్టపై వనమూలికలు కూడా ఉన్నాయని, వాటిని సేకరించేందుకు కొందరు గుట్టను ఎక్కేందుకు ప్రయత్నిస్తుంటారు. మహాజాతర సమయంలో మిగతా రోజుల్లో వచ్చే భక్తులు చిలుకలగుట్ట వద్ద సేదతీరి వంటావార్పు చేసుకుంటే మోక్షం కలుగుతుందని విశ్వాసం. దీంతో భక్తులు ఎక్కువ మంది గుట్ట పరిసరాల్లో విడిది చేస్తుంటారు. భక్తులు, ఇతరులు గుట్ట పరిసరాల్లో వేసిన వ్యర్థాలు, మలమూత్ర విసర్జన చేయడంతో అపరిశుభ్రంగా తయారవుతాయి. ఫెన్సింగ్ ఏర్పాటుతో ఎవరు కూడా గుట్టపైకి వెళ్లేందుకు వీలుండదు. ఫెన్సింగ్ ఏర్పాటుతో సమ్మక్క సారలమ్మ పూజారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి..



చిలుకలగుట్ట చుట్టూ పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పెద్దలు, అధికారులకు విన్నవించగా, ఇప్పటికి కార్యరూపం దాల్చడంతో పూజారుల కల నెరవేరనుంది. మహాజాతర సమయంలో చిలుకలగుట్ట పైకి పూజారులు తప్ప మిగతా ఎవరు కూడా వెళ్లకూడదు. కానీ ఇన్ని రోజులు ఫెన్సింగ్ లేకపోవడంతో మేడారానికి వచ్చే భక్తులు గుట్టపైకి ఎక్కేందుకు ప్రయత్నించడంతో గుట్ట అపవిత్రమవుతుంది. ఫెన్సింగ్ పటిష్టంగా ఉండేలా అధికారులు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు